


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 336 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 6 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :9 ISSUE :336 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 6 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!

- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జగన్ పర్యటన
- వైసీపీ కార్యకర్తల అతి ఉత్సాహంతో తీవ్ర గందరగోళం
- హెలిప్యాడ్ వద్ద బారికేడ్లను తోసుకువచ్చిన శ్రేణులు
- బైక్‌లతో విన్యాసాలు, సైలెన్సర్లు తీసివేసి హంగామా
- కార్యకర్తల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడిన స్థానికులు



పెన్ పవర్ డెస్క్:తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లిలో వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన అతి ఉత్సాహం

- మిగతా 2లో

## విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ. 9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు

- మిగతా 2లో

# రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

## కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

- దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్
- కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు
- పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- వైసీపీ హయాంలో ఉన్న సున్నావడ్డీ, రైతు భరోసా పథకాలు రద్దు చేశారని విమర్శ
- ప్రభుత్వం సిండికేట్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని జగన్ ధ్వజం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ. 289 ధర పలికింది. కొందరు రైతులు రూ. 365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం

- మిగతా 2లో



## వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

### అమృత వర్సిటీ స్నాతకోత్సవంలో నారా లోకేశ్

- అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవం
- గౌరవ అతిథిగా మంత్రి నారా లోకేశ్... విద్యార్థులకు దిశానిర్దేశం
- భవిష్యత్ అవకాశాల కోసం ఏపీ విద్యారంగంలో సమూల మార్పులు
- యువత ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని మంత్రి లోకేష్ ఆకాంక్ష
- వైఫల్యాలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- యువత కలల సాకారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

పెన్ పవర్ డెస్క్:ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం ఇంజనీరింగ్ వంటి నూతన సాంకేతికతలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల

- మిగతా 2లో

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- నకిలీ ఎన్‌ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు
- ఇంటర్ బోర్డు అనుమతుల కోసం దొంగ సంతకాలతో నకిలీ ఎన్‌ఓసీలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (చీూజ) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను

- మిగతా 2లో



## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు



- కామరాజర్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు
- 10 వేల పాఠశాలల్లో సూపర్ క్లీన్ క్యాంపస్ పథకం
- కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు
- సంక్షేమ పథకాలకు భారీ నిధుల కేటాయింపు
- అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యం

- మిగతా 2లో

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పిన మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
- డీప్‌ఫేక్‌లు, అభ్యంతరకర కంటెంట్ వ్యాప్తిపై చింతిస్తున్నట్లు వెల్లడి
- ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపు వ్యవహారంలో కీలక పరిణామం
- తప్పులు జరిగాయని అంగీకారం, సేఫ్ హార్బర్ రక్షణపై కేంద్రం హెచ్చరిక
- ఢిల్లీలో ఐటీ కార్యదర్శితో మెటా ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం

- మిగతా 2లో







## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

- భారత్‌లో ఏఐతో ఉద్యోగాల ముప్పు తక్కువేనన్న ప్రపంచ బ్యాంకు
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కేవలం 4.5 శాతం ఉద్యోగాలకే ముప్పు
- 16.2 శాతం ఉద్యోగాల్లో ఉత్పాదకత పెరిగే అవకాశం
- చిన్న, తక్కువ ఖర్చు ఏఐ వ్యవస్థలపైనే దృష్టి పెట్టాలని సూచన
- వైద్యం, విద్య, వ్యవసాయంలో ఏఐతో పెద్ద మార్పులు సాధ్యమని నివేదిక
- విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యాలపై పెట్టుబడులు అవసరమని సూచన

- మిగతా 2లో

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్



పెన్ పవర్ డెస్క్: వరుస పేలుళ్లతో దుబాయ్ దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళ వారం రాత్రి భారీ పేలుళ్లు చోటుచేసుకు న్నాయి. కేవలం 20 నిమిషాల్లోనే 7 భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు.

- మిగతా 2లో

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య

- మిగతా 2లో



## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

- విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీకి శ్రీకారం
- భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- అరిలోవ తోటగరువులో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణం
- అకాడమీ నమూనా, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి
- కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాశాఖ మంత్రి, టీడీపీ నేతలు

- మిగతా 2లో



# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..
# సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి
ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు.'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వి+ఫ్) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వ్యూ

## వైఎస్ షర్మిల ముందు పెద్ద టాస్క్.. రేసులో ఎక్కడ?

కాంగ్రెస్ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలకు బిగ్ టాస్క్ భయపెడుతోంది. ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయనుంది. పీసీపీ చీఫ్ షర్మిల అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉండాలని నేతలకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలపడి పార్టీ ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో అక్టోబర్ లేదా నవంబర్ లోపు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు వేగవంతం చేసింది.ఎన్నికల సన్నాహాలను ప్రారంభించింది. ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వం దృష్టి పెట్టాయి. ఆగస్టు 6న మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో కీలక సమావేశం జరగనుంది.అన్ని ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామ స్థాయి నుండి బలోపేతంపై దృష్టి పెట్టింది. అన్ని స్థానాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించింది.

**పోటీ చేసేందుకు...**

అయితే కాంగ్రెస్ లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఎంత మేరకు దొరుకుతారన్నదే ప్రశ్న. 2014 రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో పూర్తిగా పట్టును కోల్పోయింది. ఓటు బ్యాంకును కూడా కోల్పోయింది. 2014 ఎన్నికల నుంచి ఏ ఎన్నికలు జరిగినా సింగిల్ డిజిట్ ఓట్ల శాతానికే పరిమితమయింది. పార్టీ అధినాయకత్వం ఎన్ని ప్రయోగాలు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. రఘువీరారెడ్డి ని పీసీసీ చీఫ్ గా మొదలు పెట్టి అనేక మందిని మార్చారు. చివరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిలను పార్టీ చీఫ్ గా నియమించారు. అయితే షర్మిలను నియమించినప్పటికీ పార్టీ ఏమాత్రం పుంజుకోలేదు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తాన్ని జగన్ ఎగరేసుకుని వెళ్లడంతో ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపిచండం లేదు.

**తొలినాళ్లలో జోరుగా జిల్లాలు...**

వైఎస్ షర్మిల కూడా తొలినాళ్లలో కొంత జోరుగా జిల్లాలు పర్యటనలు చేసినప్పటికీ రాను రాను ఆమె ఎక్స్ వేదికగా స్పందించడం, మీడియా సమావేశాలకే పరిమితమయ్యారు. వైఎస్ షర్మిల ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ అంతకు ముందు కూడా షర్మిల పెద్దగా రాష్ట్రంలో పర్యటించలేదు. ఏదైనా కార్యక్రమం ఉంటే విజయవాడ వచ్చి పాల్గొని వెళుతున్నారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం, జగన్ పై కుటుంబ సమస్యలు ప్రస్తావిస్తుండటాన్ని స్థానిక కాంగ్రెస్ క్యాడర్ నుంచే పెద్దగా మద్దతు ప్రకటించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వంపై అప్పుడప్పుడూ విమర్శలు చేస్తున్నా ఎక్కువగా జగన్ పైనే విమర్శలు చేయడాన్ని పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. నాయకులు కూడా వైఎస్ షర్మిలకు సహకరిచడం లేదు. కొందరు హైకమాండ్ కు కూడా షర్మిల వైఖరిపై ఫిర్యాదు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప తిరిగి నేతలు యాక్టివ్ కారన్నది వాస్తవం. కానీ అది ఎంత దూరముందో ఎవరికీ తెలియదు.

## వైఫల్యాలకు భయపడొద్దు.. కఠిన మార్గాన్నే ఎంచుకోండి

- మొదటి పేజి తరువాయి
మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకునేలా సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మంత్రి లోకేశ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువత కేవలం ఉద్యోగార్థులుగా మిగిలిపోకూడదు, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలన్నదే మా లక్ష్యం. వారు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, నాయకులుగా ఎదగాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాలను, పరిశ్రమలను మరింత దగ్గర చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, యువత నేర్చుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నాయకత్వం వహించడానికి అవకాశాలు కల్పిస్తున్నాం" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన కాలంలో విద్యార్థులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఒక గొప్ప ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.

**వైఫల్యాలను చూసి భయపడొద్దు**

పట్టా పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "ఈరోజు మీ ప్రయాణానికి ముగింపు కాదు, ఒక కొత్త ప్రయాణానికి ఆరంభం కావాలి. వైఫల్యాన్ని చూసి ఎప్పుడూ భయపడకండి. వైఫల్యం అంటే మీరు సమర్థులు కాదని కాదు, ప్రయత్నించే ధైర్యం మీకుందని అర్థం. విజయం ఎప్పటికీ ప్రయత్నం విరమించని వారినే వరిస్తుంది. ప్రపంచంలో మార్పు తేగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి" అని పిలుపునిచ్చారు. ఈ డిగ్రీ కేవలం విద్యార్థులది మాత్రమే కాదని, వారి తల్లిదండ్రుల త్యాగాలు, కుటుంబ సభ్యుల మద్దతు, గురువుల మార్గనిర్దేశం కూడా ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు.

**విలువలతో కూడిన విద్య అమృత ప్రత్యేకత**

అమృత యూనివర్సిటీ అందిస్తున్న విద్యను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. "చాలా విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని, పట్టాలను అందిస్తాయి. కానీ అమృత యూనివర్సిటీ ఆలోచించడం, నాయకత్వం వహించడం, సేవ చేయడం వంటివి నేర్పుతుంది. విద్య అంటే కేవలం కెరీర్ నిర్మించుకోవడం మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినదని ఈ వర్సిటీ విశ్వసిస్తుంది. కరుణ, విలువలతో సమాజానికి సేవ చేయడమే విద్య అంతిమ లక్ష్యమన్న పూజ్యనీయులైన 'అమ్మ' దృక్పథం ఎంతో గొప్పది" అని కొనియాడారు. జ్ఞానం మనకు నైపుణ్యాన్ని, సాంకేతికత శక్తిని ఇస్తే, కరుణ వాటికి ఒక పరమార్థాన్ని ఇస్తుందని, అదే అమృత నేర్పే అత్యున్నత పాఠమని అన్నారు.

**నైపుణ్యంపై దృష్టి సారించండి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే సులువైన మార్గాన్ని కాకుండా, సవాళ్లతో కూడిన కఠినమైన మార్గాన్నే ఎంచుకోవాలని లోకేశ్ యువతకు సూచించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ, "మీరు ఎక్కడ మొదలుపెట్టారన్నది ముఖ్యం కాదు, ఎక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నదే ముఖ్యం. విజయం కోసం పరుగులు తీయకుండా, అత్యుత్తమ నైపుణ్యం సాధించడంపై దృష్టి పెట్టండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది" అని హితవు పలికారు. నిరంతరం నేర్చుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలాన్ని కలిగి ఉండాలని కోరారు.

**యువత కలలకు అండగా ఉంటాం**

"భారతదేశం గర్వపడేలా ఏదైనా నిర్మించాలని కలలు కనండి. అది కంపెనీ కావచ్చు, కొత్త టెక్నాలజీ కావచ్చు, లేదా సామాజిక కార్యక్రమం కావచ్చు. మీ కలల సాకారానికి, మీ ప్రయాణానికి మద్దతు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వాస్తవ సమస్యలను పరిష్కరించడానికి, ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి మీ జ్ఞానాన్ని ఉపయోగించండి" అని లోకేశ్ ఆకాంక్షించారు. 20 ఏళ్ల తర్వాత విద్యార్థులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తిరిగి వచ్చి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట..
## పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం లభించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్య కోసం రూ.44,527 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ఎన్.మారీ విల్సన్ ప్రకటించారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం 'పెరుంతలైవర్ కామరాజర్ మోడల్ స్కూల్స్' పేరుతో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఈ పథకానికి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.125 కోట్లు కేటాయించారు.ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు 'సూపర్ క్లీన్.. సూపర్ క్యాంపస్' పథకం కింద రూ.129 కోట్లు కేటాయించారు. తొలి దశలో 10 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు.ఉన్నత విద్యనభ్యసించేవాళ్లకు 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' కింద ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే అవగాహన కార్యక్రమాలకు రూ.7 కోట్లు కేటాయించారు.సంక్షేమ పథకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకానికి రూ.560 కోట్లు కేటాయించింది. పెళ్లి రోజు వధువుకు ఎనిమిది గ్రాముల బంగారు నాణెం, పట్టు చీర అందించే పథకానికి రూ.812 కోట్లు ప్రతిపాదించింది.

రాష్ట్ర అప్పులు గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## దిగొచ్చిన మెటా.. భారత్‌కు క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోదీ వీడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి.ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రధాని మోదీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది.దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే అన్ని సమస్యలకు అత్యంత శక్తివంతమైన పరిష్కారమని వ్యాఖ్యానించారు. అయితే శాంతిభద్రతలను కాపాడే క్రమంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విచక్షణపై తమకు నమ్మకం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నివేదికలను పరిశీలించిన పిమ్మటే ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## ఏఐతో భయపడొద్దు.. భారత్‌కు లాభాలే ఎక్కువ

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల మధ్య ప్రపంచ బ్యాంకు ఆసక్తికర నివేదిక విడుదల చేసింది. భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయడం కంటే, ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించింది. సరైన చర్యలు తీసుకుంటే శతాబ్దం పట్టే అభివృద్ధిని పదేళ్లలోనే సాధించే అవకాశం ఉందని పేర్కొంది.ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. అధిక ఆదాయ దేశాల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 14.2 శాతం ఏఐ ఆటోమేషన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో మాత్రం ఈ ముప్పు 4.5 శాతమే. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 16.2 శాతం ఉద్యోగాల్లో ఏఐ వల్ల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంఖ్య 18.7 శాతంగా ఉంది.భారీ ఏఐ మోడళ్లు, ఖరీదైన డేటా సెంటర్ల నిర్మాణం కంటే స్థానిక అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో పనిచేసే ఏఐ వ్యవస్థలను వినియోగిస్తే భారత్‌కు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ప్రపంచ బ్యాంకు సూచించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయ సేవలు, ప్రభుత్వ సేవల్లో ఏఐ కీలక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడింది. ఇప్పటికే భారత్‌తో పాటు కెన్యా, మెక్సికో, నైజీరియా, థాయ్‌లాండ్‌లో ఐదుగురికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ఐదింటిలో ఒకటి ఏఐ చాట్‌బాట్‌లను వినియోగిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది.

అయితే విద్యుత్, ఇంటర్నెట్, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నాణ్యమైన డేటా, బలమైన వ్యవస్థలు లేకపోతే ఏఐ ప్రయోజనాలు పూర్తిగా అందవని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. దశలవారీగా ఏఐను అమలు చేయాలని, గోప్యతకు రక్షణ కల్పిస్తూ బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది.

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి
వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

సాగర నగరం విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు.అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ భరణి, గ్రీన్ కో ఎనర్జీ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లిలో జగన్ పర్యటన.. శ్రుతిమించిన శ్రేణుల ఉత్సాహం!

- మొదటి పేజి తరువాయి
గందరగోళానికి దారితీసింది. తమ నాయకుడికి స్వాగతం పలికే క్రమంలో కొందరు కార్యకర్తలు విపరీత ధోరణులతో వ్యవహరించడం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. స్థానికంగా ఉన్న ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేసినట్టు తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే, జగన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దేవరపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయిన వెంటనే, ఆయన్ను చూసేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకువచ్చారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం లెక్కచేయకుండా తోసుకురావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో బారికేడ్లు విరిగిపోయి, స్వల్పంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అంతేకాకుండా, దేవరపల్లి ప్రధాన రహదారులపై వైసీపీ కార్యకర్తలు బైక్‌లతో చేసిన హంగామా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అనేకమంది యువకులు తమ బైక్‌ల సైలెన్సర్లను తొలగించి, భారీ శబ్దాలతో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు చేస్తూ హల్‌చల్ సృష్టించారు. ఈ పరిణామాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తమ అభిమాన నేతపై ఉన్న ఉత్సాహాన్ని ప్రదర్శించే క్రమంలో కార్యకర్తలు శ్రుతిమించడం విమర్శలకు తావిచ్చింది.

## 20నిమిషాల్లో 7పేలుళ్లు.. దద్దరిల్లిన దుబాయ్

- మొదటి పేజి తరువాయి
పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతం పక్కనే ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయం ఉంది.పేలుళ్ల అనంతరం దుబాయ్‌లోని ఓడరేవుకు ఆనుకుని ఉన్న ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే ఒక గిడ్డంగిలో మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పేలుళ్ల వెనక హూతీల హస్తం ఉందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. యెమెన్ నుంచి ఈ క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాక్ ఆరోపించింది. కాగా ఈ పేలుళ్లపై యూఏఈ అధికారిక ప్రకటన చేయలేదు.

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ.. 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

- మొదటి పేజి తరువాయి
తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్‌ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

**ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:**

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట
రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర
ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి
మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి
వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థి కి కరాటే లో సిల్వర్ మెడల్



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 05:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ ఏ.ఐ.ఎం.ఎల్. చదువుతున్న ఎమ్. ధనుష్ శ్రీ వెంకట సాయి ఈ నెల 1 మరియు 2 వ తేదీలలో విజయవాడ లొ జరిగిన 23 వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ లొ సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది అని ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సిలర్ డా. ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డా.ఎం.శ్రీనివాస రెడ్డి సిల్వర్ మెడల్ విజేత ఎమ్. ధనుష్ శ్రీ వెంకట సాయి ని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభినందనలు తెలియజేశారు. , ఈ కార్యక్రమం లో ఆదిత్య యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సిలర్ డా ఎ రమేష్,ఆదిత్య యూనివర్సిటీ రిజిస్టర్ డా. జి సురేష్,డీన్ స్టూడెంట్ ఏఫైర్స్ డా. డి కిషోర్,ఆదిత్య యూనివర్సిటీ వ్యాయామ విభాగాధిపతి డా. ఎన్ రవి,పాల్గొనడం జరిగింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పారిశుధ్యం అందరి బాధ్యత





- ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ జిల్లా సాధ్యం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన గీతం ఆవిష్కరణ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 5:** పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కాకినాడ జిల్లా వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రత,చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన ప్రత్యేక అవగాహన గీతాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చెత్తను సక్రమంగా నిర్వహించకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు.తడి,పొడి చెత్తను వేర్వేరుగా విభజించి,తడి చెత్తను వర్మీ కంపోస్ట్ ఎరువుగా,పొడి చెత్తను 'స్వచ్ఛరథం' ద్వారా నిత్యావసర వస్తువులుగా మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు.శ్రద్ధగా చెత్తను విభజిస్తే "చెత్త కూడా సంపదగా మారుతుంది" అనే సందేశాన్ని ఈ గీతం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ఈ అవగాహన గీతాన్ని కాజులూరు ఎంపీడీవో జాగరపు రాంబాబు రచించగా,ప్రత్తిపాడు జలవనరుల శాఖ ఏఈఈ డా.పొట్నూరి రజనీకాంత్ స్వరకల్పన చేసి ఆలపించారు. సంగీతాన్ని కాజులూరు ఎంపీడీవో కార్యాలయానికి చెందిన డా.శివకోటి విజయ్ ప్రసాద్ అందించారు.

# "డిజైన్ యువర్ డెస్టినీ" కెరీర్ గైడెన్స్ సెమినార్




**గండేపల్లి మండలం గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు0 5** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం లో పెట్రోలియం ు మైనింగ్ విభాగం ఆధ్వర్యంలో "డిజైన్ యువర్ డెస్టినీ" అనే అంశంపై కెరీర్ గైడెన్స్ సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో (2014 బ్యాచ్) పూర్వ విద్యార్థులు పి.టి. వెంకటేష్, అసిస్టెంట్ డ్రిల్లర్ (అబుదాబి), ఆర్. అభిలాష్, సేఫ్టీ హెడ్ (దుబాయ్), అలాగే ఐ. దినేష్, సీఈఓ ు ఫౌండర్, డెస్టినీ ఇన్నోవేషన్ హబ్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు పెట్రోలియం మరియు మైనింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ ప్రణాళికపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా ప్రో వైస్ చాన్సలర్ (ఈ ు ఎస్) డా. ఎ. రమేష్ , డీన్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా. జి. శ్రీదేవి , పెట్రోలియం ు మైనింగ్ విభాగాధిపతి చిన్న సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ .. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చు అని సూచించారు.ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.


## వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే రాజమార్గం




**ఆలమూరు,పెన్ పవర్, ఆగస్టు 05;**న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తూ సమయం, ఆర్థిక వనరులు కోల్పోవడం కంటే.. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారమైన మీడియేషన్ (మధ్యవర్తిత్వం) ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడమే రాజమార్గమని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఐ ప్రవీణ్ కూమార్ అన్నారు. 'మీడియేషన్ ఫర్ నేషన్ 3.0' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ఆలమూరులో న్యాయవాదులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రవీణ్ కూమార్ మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రారంభమైన 'మీడియేషన్ ఫర్ నేషన్ 3.0' కార్యక్రమం డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని తెలిపారు.మధ్యవర్తిత్వం ద్వారా రాజీ పడితే ఇరు పక్షాలకూ సముచిత న్యాయం జరిగి, సంతోషంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కుదిరే ఒప్పందాలకు చట్టబద్ధత ఉంటుందని, ఆ తీర్పుపై తిరిగి పైకోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కక్షిదారులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి దిశగా జిల్లాలో నాలుగు బయోగ్యాస్ ప్రాజెక్టులు



- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 5::** గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలు, వంటశాల (కిచెన్) వ్యర్థాలను సద్వినియోగం చేసుకుని వ్యర్థాల నుంచి సంపద సృష్టించే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు ప్రత్యేక బయోగ్యాస్ ప్రాజెక్టులను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్,మున్సిపల్,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ప్రతిపాదిత ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం,బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా నివారించడం ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) లక్ష్యాల సాధనకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు.ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్ (గోబర్ గ్యాస్) పునరుత్పాదక ఇంధనంగా ఉపయోగపడుతూ గ్రామీణ కుటుంబాలకు వంటతో పాటు ఇతర అవసరాలకు తక్కువ వ్యయంతో అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతిపాదిత నాలుగు ప్రాజెక్టులకు సంబంధించి జేఎన్‌టీయూ పరిధిలో తగిన స్థలాలను గుర్తించినట్లు తెలిపారు.
పిఠాపురం పాదగయ వద్ద మున్సిపల్ వ్యర్థాలతో అనుసంధానం చేసి బయోగ్యాస్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు,అన్నవరంలో కొండ దిగువన ఉన్న పశువుల శాల నుంచి పేడ,కిచెన్ వ్యర్థాలు,అరటి ఆకులను వినియోగించి బయోగ్యాస్‌తో పాటు సేంద్రీయ ఎరువు తయారీ, విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.రైతులు తమ వద్ద ఉన్న పశువుల వ్యర్థాలను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. గోబర్ధన్ పథకం ద్వారా బయోగ్యాస్ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన సేంద్రీయ ఎరువు భూసారాన్ని కాపాడటంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుందని చెప్పారు. అంతేకాకుండా కర్బన ఉద్గారాల తగ్గింపు, పర్యావరణ కాలుష్య నియంత్రణలో కూడా ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మనోజ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మహమ్మద్ అబ్దుల్ మతిన్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గోదావరి మహాపుష్కరాలు--2027ను భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటేలా నిర్వహించాలి



- అధికారుల సమన్వయంతో భక్తులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 5:** గోదావరి మహాపుష్కరాలు--2027ను భారతీయ సనాతన ధర్మం, ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే మహోత్సవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీరపాండ్యన్ ఆధ్వర్యంలో పుష్కరాల నిర్వహణపై ఆరు జిల్లాల కలెక్టర్లు,వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి పుష్కర భక్తుడికి అన్ని వసతులు కల్పిస్తూ ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాలను కేవలం ఒక ఉత్సవంగా కాకుండా భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించే మహోత్సవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కాకినాడ జిల్లాలో 16 శాఖలకు సంబంధించిన 278 అభివృద్ధి పనులను రూ.49.92 కోట్లతో ప్రతిపాదించగా, ఇప్పటివరకు దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన 15 పనులకు రూ.2.12 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ రహిత పుష్కరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరి పవిత్రతను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఘాట్‌ల వద్ద పరిశుభ్రత, పారిశుద్ధ్యం,సురక్షిత తాగునీరు, వ్యర్థాల నిర్వహణను అత్యున్నత ప్రమాణాలతో అమలు చేయాలని సూచించారు.అలాగే భక్తుల భద్రత, క్రమబద్ధమైన ట్రాఫిక్ నిర్వహణ, నిరంతర వైద్య సేవలు, తాత్కాలిక వసతి,తాగునీటి సౌకర్యాలు,అత్యవసర సేవలు వంటి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ పి. రామకృష్ణారెడ్డి,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మహమ్మద్ అబ్దుల్ మతిన్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత,కలెక్టరేట్ సూపరింటెండెంట్ జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



# మైనింగ్ రవాణా అరికట్టేందుకు కృషి చేయండి...



బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్...

**కాకినాడ పెన్ పవర్ ఆగస్టు 05:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం రౌతులపూడి మండలాల ప్రధాన రహదారిపై ప్రయనిస్తున్న మైనింగ్ భారీ టిప్పర్ లారీల రవణాను అరికట్టాలని బిజెపి కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ చిరుకూరి రామ్ కుమార్ పిలుపునిచ్చారు.

మండల కేంద్రమైన శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను చిరుకూరి రామ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంఖవరం రౌతులపూడి మండలాల మీదగా వెళ్తున్న భారీ టిప్పర్ లారీల ద్వారా పర్యావరణం నశించిపోతుందని, రెండు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రోగాల బారిన కూడా పడ్డారని తెలిపారు. త్వరలో రెండు మండలాల సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి మైనింగ్ రవాణా వ్యవస్థ పై కార్యచరణ చేపడతానని ఈ కమిటీ నిర్మాణానికి శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల కృష్ణ మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం ఉద్యమించడానికి మా కమిటీ సిద్ధంగా ఉందని ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమని మైనింగ్ రవాణా అరికట్టేందుకు మద్దతును తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగడాల సన్యాసరావు, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరావు, కమిటీ సభ్యులు బొర్రా వీర వేంకట రమణ,బొమ్మిడి సత్యనారాయణ,రేలంగి వెంకట సత్యనారాయణ,పడాల కృష్ణ, మొగిలి శ్రీను, ములికి అప్పారావు,కొంగు రమేష్, బత్తిన తాతాజీ, కానేటి వెంకటరమణ, గునపర్తి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన



**ఆత్రేయపురం, పెన్ పవర్ ఆగస్టు 5:** ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం--11లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. పద్మావతి తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. శిశువు జన్మించిన తొలి గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, తల్లిపాలే బిడ్డకు తొలి టీకా వంటివని ఆమె తెలిపారు. పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పోషకాహారాన్ని ప్రారంభించినప్పటికీ రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని చెప్పారు.

అనంతరం తల్లులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇస్తూ, తల్లి ఆరోగ్యం, శిశు సంరక్షణ, సమతుల్య ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. పద్మావతి, ఏఎన్ఎం ఎన్.వి. నాగలక్ష్మి, ఆశా కార్యకర్త డి. వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సి.వి.వి.ఎల్. లావణ్య, డి. వీరవేణి తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం-సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి....

- మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- కత్తిపూడిలో తల్లిపాల వారోత్సవాల పై అవగాహన





**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 05:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొదటి ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలే ఆహారం,తల్లిపాలే నీరు అని అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ప్రారంభించాలని, తేనె,పశువుల పాలు,ఇతర పానీయాలు, డబ్బా పాలు ఇవ్వకూడదని సూచించారు. బిడ్డకు అవసరమైన నీరు, పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని వివరించారు. ఉద్యోగాలకు వెళ్లే మహిళలు శుభ్రమైన పాత్రలో పాలను సేకరించి ఫ్రిజ్‌లో నిల్వ చేసి 24 గంటల్లోపు కప్పు లేదా చెంచాతో బిడ్డకు ఇవ్వవచ్చని సూచించారు. తల్లిపాలు బిడ్డకు శక్తిని,ఆరోగ్యాన్ని అందించడంతో పాటు తల్లికీ అనేక ప్రయోజనాలు కలిగిస్తాయని వివరించారు. పాల ఉత్పత్తికి శరీరం అదనపు కేలరీలను ఖర్చు చేయడం ద్వారా గర్భధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గేందుకు దోహదపడుతుందని,కొన్ని రకాల క్యాన్సర్లు, దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తుందని తెలిపారు. తల్లిపాలు ఇచ్చే సమయంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్, ప్రోలాక్టిన్ హార్మోన్లు ఒత్తిడి,ఆందోళనను తగ్గించి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బివి రజని,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నవరం సత్యదేవుని అన్నదానానికి రూ.1,00,006/- విరాళం




**అన్నవరం,పెన్ పవర్ ఆగస్టు. 5:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తాడేపల్లి గూడెం చెందిన పట్నాల నాగమణి రూ.౦1,00,006/-లిలను విరాళంగా అందజేశారు. దాత సమర్పించిన విరాళాన్ని దేవస్థానం అధికారులు స్వీకరించి, ఆమె భక్తి భావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యదేవుని దర్శనం, ప్రత్యేక ప్రసాదం అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు అందిస్తున్న విరాళాలు వేలాది మంది యాత్రికులకు అన్నప్రసాదం అందించడంలో ఎంతో దోహదపడుతున్నాయని అధికారులు తెలిపారు. భక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింతగా సహకరించాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

## గెద్దనాపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.





- తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంతోపాటు తల్లికి ఎంతో శ్రేయస్కరం.
- జగ్గంపేట ఐసిడిఎస్,సిడిపిఓ,ఎం పూర్ణిమ.

**కిర్లంపూడి,పెన్ పవర్ ఆగస్టు, 05:** తల్లి పాలతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని జగ్గంపేట ఐసిడిఎస్, సిడిపిఓ, ఎం పూర్ణిమ అన్నారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి అంగన్వాడీ కేంద్రంలో జగ్గంపేట ఐసీడీస్ సిడిపిఓ,ఎం పూర్ణిమ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం తల్లులకు తల్లిపాలు యొక్క విశిష్టతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ తల్లి పాలు- శిశువుకు తొలి టీకా మాత్రమే కాకుండా,సంపూర్ణ ఆహారం" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందన్నారు. శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వాలని,మొదట వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు అమూల్యమైన రక్షణ కవచమన్నారు. ఇవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల బారి నుండి కాపాడుతాయన్నారు.

శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమేఇవ్వాలన్నారు.

ఆరు నెలల తర్వాత ఇంటి ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించడం తల్లి,బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం అన్నారు. తల్లి పాల వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడమే కాకుండా

రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

మెదడు ఎదుగుదల మెరుగుపడడమే కాకుండా, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. తల్లికి కూడా శిశువుకు పాలు ఇవ్వడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కుటుంబ సభ్యులు తల్లికి అవసరమైన విశ్రాంతి, పోషకాహారంతోపాటు మానసిక ధైర్యాన్ని అందించాలన్నారు. మనమందరం కలిసి ప్రతి శిశువుకు తల్లి పాల హక్కు అందేలా కృషి చేద్దాం. ఆరోగ్యవంతమైన పిల్లలు, ఆరోగ్యవంతమైన కుటుంబాలు ఉండేలా కృషి చేద్దాము అన్నారు.

ఈ సందర్భంగా 6 నెలలు నిండిన 3 మంది పిల్లలకు అన్న ప్రాసన చేసారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకట శివ, గుడాల చిట్టిబాబు, సూపర్వైజర్ బూసమ్మ అంగన్వాడీ టీచర్ లు, తల్లులు పాల్గొన్నారు.

## శంఖవరం పంచాయతీ షాపుల లీజుల అడ్వాన్స్ రెండేళ్ళు ఎవ్వరి వద్ద మూలిగాయి....

ఇంకనూ రెండు షాపులకు లీజుదారులు చెల్లించిన అడ్వాన్స్ ఎందుకు జమ కాలేదు....

పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తున్న శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు మేకల కృష్ణ....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 05:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలో గల మార్కెట్ లో పంచాయతీకు చెందిన 22 షాపులకు లీజు దక్కించుకున్న లీజుదారులు చెల్లించిన అడ్వాన్సు రెండేళ్ళుగా ఎందుకు ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదని, తాము అడిగిన తర్వాతే చెల్లించడం ఏమిటని, ఇప్పటి వరకు ఆ సొమ్ము ఎవ్వరి వద్ద మూలిగిందో పంచాయతీ అధికారులు తేటతెల్లం చేయాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రశ్నించింది. సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ నివాస గృహంలో సంఘం సభ్యులు పర్వత రామకృష్ణ, గునపర్తి అపురూప్, పగడాల బాబ్జి, బొమ్మిడి చిట్టిబాబు, రేలంగి సత్యనారాయణ కానేటి వెంకటరమణ బత్తిన తాతాజీ కొంగు రమేష్ పాల్గొని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ మార్కెట్ లో 22 షాపులను 15వ ఆర్థిక సంఘం నిధులతో 2023లో నిర్మించారన్నారు. వీటికి 1.7.2024 నుండి 30.6.2027 వరకు మూడేళ్ళ కాలానికి వేలం నిర్వహించారు. ఆయా షాపులకు వాటి డిమాండ్ ను

బట్టి ఒక్కొ దానికి ఒక విధంగా డిపాజిట్ లను వసూలు చేసారు. ఆ వసూలు చేసిన సొమ్మును సమాచార హక్కు చట్టం ద్వారా డిసెంబర్ లో తాను అడిగిన తర్వాత ఫిబ్రవరి 2026 నుండి ఒక్కొక్క షాపుకు ఒక్కోక్క తేదీన ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లుగా చలానాలు వెల్లడిస్తున్నాయి. ఇంకనూ 3 షాపులకు పూర్తిగానూ, కొన్ని షాపులకు డిపాజిట్లు బకాయిలు ఉన్నాయన్నారు. లీజుదారులు వేలం దక్కించుకున్న వెంటనే డిపాజిట్లు చెల్లించినప్పటికీ ప్రభుత్వ ఖాతాకు జమ చేయకపోవడం అధికారుల అలసత్వమా... లేక ఎవ్వరైనా వీటిని తమ సొంత ప్రయోజనాల కోసం రెండేళ్ళుగా వాడుకున్నారా... దీనిపై శంఖవరం గ్రామ ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయవలసిన బాధ్యత పంచాయతీ అధికారులకు ఉందని కృష్ణ అన్నారు. అనంతరం విలేకర్లకు తాను సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ అధికారులు డిపాజిట్లను ప్రభుత్వ ఖాతాకు జమ చేసిన చలానాల నకళ్ళను, ఇతర సమాచారాన్ని అందించారు. వీటిపై ఉన్నతాధికారులు పూర్తి దర్యాప్తు నిర్వహించి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం, డిపాజిట్లు జమ చేయడంలో నిర్లక్ష్యం చేసిన వారిపైన తగిన చర్యలు చేపట్టాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేసింది.

# ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలు నష్ట పోతే





పంటల బీమా ఎంతగానో దోహదం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 05:** ఎల్ నినో వల్ల పంటలు నష్టపోతే పంటల బీమా ఎంతగానో దోహద పడుతుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి జోకా అమృత అన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం, వేములపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులు,పంటలకు సంభవించే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు,ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో పంట నష్టం సంభవించినప్పుడు రైతులకు పంట బీమా పరిహారం ఎంతో ఉపయోగపడుతుందని

వివరించారు. రైతులందరూ

తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని,ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు ఎకరానికి రూ.760 ప్రీమియం చెల్లించి సకాలంలో బీమా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పంట నష్టం సంభవించినప్పుడు అర్హత మేరకు పరిహారం పొందేందుకు బీమా రక్షణ కల్పిస్తుందని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలపరిమితి, తక్కువ నీటితో సాగు చేసుకునే పప్పుధాన్యాలు,

చిరుధాన్యాలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. మినుము (వీబీఎన్-8, వీబీఎన్-9), పెసర, రాగులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ సమయంలో పంట చేతికి రావడంతో పాటు ఆశించిన ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు గణేష్,జలజతో పాటు పెద్దిపాలెం,వేములపాలెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ మృతి తీరని లోటు





- మాజీ ఎమ్మెల్సీ అంగులూరి లక్ష్మీ శివకుమారి కుటుంబాన్ని పరామర్శించిన దాడిశెట్టి రాజా
- వైఎస్సార్‌సీపీ కుటుంబం అండగా ఉంటుందని భరోసా

**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ ఆగస్టు 05:–** కాకినాడ జిల్లాప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ అంగులూరి లక్ష్మీ శివకుమారి భర్త అంగులూరి బాలకృష్ణ మృతిపట్ల కాకినాడ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలకృష్ణ మృతి లక్ష్మీ శివకుమారి కుటుంబానికి మాత్రమే కాకుండా ఆయనను అభిమానించిన ప్రతి ఒక్కరికీ తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బాలకృష్ణ నివాసానికి చేరుకున్న దాడిశెట్టి రాజాకు కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారిని పరామర్శించిన ఆయన, జరిగిన విషాద ఘటన పట్ల ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. అనంతరం బాలకృష్ణ--లక్ష్మీ శివకుమారి దంపతుల ముగ్గురు కుమారులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఇలాంటి క్లిష్ట సమయంలో మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని, పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. బాలకృష్ణ నిరాడంబర జీవనం గడిపిన వ్యక్తి అని, అందరితో ఆప్యాయంగా మెలుగుతూ మంచి మనసుతో సేవాభావంతో జీవించారని అన్నారు. ఆయన స్నేహశీలి, మానవతా దృక్పథం కలిగిన వ్యక్తిగా అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన ఆయన మరణం సమాజానికి కూడా లోటేనని వ్యాఖ్యానించారు. మాజీ ఎమ్మెల్సీగా ప్రజా జీవితంలో సేవలందిస్తున్న లక్ష్మీ శివకుమారి ఈ క్లిష్ట పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాలకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పరామర్శ అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బాలకృష్ణ చిత్రపటానికి దాడిశెట్టి రాజా పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ విషాద సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబానికి అండగా నిలవడం పట్ల స్థానికులు అభినందించారు.

## పశువులకు అవసరమైన దాణా వివరాలను పశు వైద్య సిబ్బంది ముందుగానే సేకరించాలి

అమలాపురం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్ అనిత సూచన



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 08;** గ్రామాల్లో పశువులకు పచ్చగడ్డి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతీ గ్రామంలో రైతుల దగ్గర ఉన్న పశువుల వివరాలు, పచ్చగడ్డి వివరాలు సేకరించాలని పశు వైద్యులకు పశుసంవర్ధక శాఖ అమలాపురం డీడీ డా.ఎల్. అనిత సూచించారు. ఆలమూరులో బుధవారం ఆలమూరు మండలప్రజాపరిషత్ కార్యాలయంలో పశు వైద్యులు, సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. కోనసీమ పశు దాణాకు సంబంధించి ఒక్కొక్క సొసైటీ పరిధిలో పశువులకు అవసరమైన దాణా వివరాలను సైతం సేకరించి ఉన్నతాధికారులకు ముందుగానే తెలియజేయాలని తెలిపారు. రూ.1350 విలువైన పెయ్యదూడలు మాత్రమే పుట్టే వీర్యాన్ని రూ.150కు మాత్రమే పశుసంవర్ధక శాఖ అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం పశు వైద్యులు రైతులు అవగాహన కల్పించాలని తెలిపారు. గొర్రెలకు ఖచ్చితంగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. అనంతరం ఆలమూరు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులుగా సేవలు అందించి అమలాపురం పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులుగా పదోన్నతి పొందిన డా.ఎల్. అనితను ఆలమూరు పశుసంవర్ధకశాఖ ఏడీఏ బీవివి సత్యనారాయణ, పశువైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానికంగా పశుపోషకులకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, పశువైద్యులు డా. భానుప్రసాద్, డా. వినోద్ కుమార్, డా. సుభాష్ చంద్ర, రామచంద్రపురం ఏడీఏ ఓ రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు, సొసైటీ చైర్మన్ వంటిపల్లి సతీష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా రాంబాబు, సలాది నాగేశ్వరరావు, రామానుజుల శేషగిరిరావు, సిరిగినీడి పట్టాభి, బైరిశెట్టి రాంబాబు,నెక్కంటి సూర్య ప్రకాశరావు, చల్లా ఏడుకొండలు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్లపాలెంలో టీడీపీ డోర్ టు డోర్ కార్యక్రమం



**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 5::** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు, వాసంశెట్టి సత్యం సూచనలతో కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల అధ్యక్షుడు చవ్వాకుల డాక్టర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలు, సూచనలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి పలివెల రాజు, సొసైటీ అధ్యక్షుడు అంగర కృష్ణతో పాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటల బీమాతో రైతులకు ఎంతో మేలు.




- ఆగస్టు 15 లోపు ఎకరానికి 760 చెల్లించి పంటల భీమా నమోదు చేసుకోవాలి.
- ఏఓ నాగం సుధామాధురి.

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 05:** ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు పంటల బీమా పథకంలో చేరడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు. మండలంలోని పాలెం,సోమరాయునిపేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి పంటల బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించారు.బ్యాంకుల ద్వారా పంట రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా బీమా ప్రీమియం చెల్లించి పథకంలో నమోదు చేసుకోవచ్చని సూచించారు.జిల్లాలో వరి పంటకు ఎకరానికి రూ.760 ప్రీమియం చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా పంటల బీమా పథకంలో చేరాలని కోరారు.ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే సమయంలో బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని వివరించారు.రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని,ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా వాటిని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.కాంప్లెక్స్ ఎరువులను నాట్లు వేసిన 15 రోజుల తర్వాత వినియోగించరాదని సూచించారు.పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెనగంటి బాబ్జి,అడబాల కొండబాబు,ఏఈఓ ఎన్ సీతారామమూర్తి,వీఏఏ విజయరాణి,అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## శిశువుకు తల్లిపాలతో పూర్తి పోషణ



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 05;** పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వలన పూర్తి పోషణ కలిగి మెదడు ఎదుగుదల జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.వరలక్ష్మి దేవి తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కొత్తపేట సిడిపిఓ ఏ.గజలక్ష్మి ఆదేశాల మేరకు మండలంలోని మూలస్థానం అగ్రహారం అంగన్వాడి సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వలన శిశువుకు రోగ నిరోధక శక్తి, జీర్ణ ప్రక్రియ మెరుగుదల అవుతుందన్నారు. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తర్వాత తల్లిపాలు కొనసాగిస్తూ అనుబంధ ఆహారంతోపాటు పాలను రెండు ఏళ్ల పాటు కొనసాగించాలని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి గర్భాశయ సంకోచన, బరువు నియంత్రణ, క్యాన్సర్ బారి నుండి రక్షించబడతారని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఏం.నాగమణి, ఏఎన్ఎం షేక్ షకీలా, ఆశాలు రాణి, రత్నకుమారి, భాగ్యవతి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



**అల్లవరం,పెన్ పవర్,ఆగష్టు05:** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఓ వై రమాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామంలోని మిలటరీ కాలనీ 83వ అంగనవాడి సెంటర్ లో తల్లులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ రమాదేవి హాజరై మాట్లాడుతూ పుట్టిన బిడ్డ కు తల్లిపాలు ఇవ్వడం చాలా శ్రేష్టకరమైనదని, బిడ్డ ఆరోగ్యం ఉండేందుకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంపై కొందరి తల్లుల్లో అపోహలు ఉన్నాయని, అవి విడనాడాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. వారికి అవసరమైన పోషక పదార్థాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె వీ ఎల్ డీ కుమారి,అంగన్వాడి కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాణ్యతలో రాజీ వద్దు పది కాలాలు మన పేరు ఉండాలి.

సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము.





**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 05:--** ఏ పని చేసినా నాణ్యతతో ఉండాలని పని చేసిన వారు ఎవరని పదికాలాలు చెప్పుకునేలా ఉండాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము అన్నారు. మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో మండల పరిషత్ స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో నాడు నేడు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకువెళగా మిగిలి పనులు పూర్తిచేయాలని ఆదేశించారని దీనిలో భాగంగానే మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామని ఈ నిర్మాణంలో ఎ నాణ్యత మరియు బాధ్యతగా నిర్మించాలని ఆయన అన్నారు. బుధవారం ఆయన పాఠశాలను ఎంపీడీవో ఎం గోవిందు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు (వెంకటేశ్వరరావు) నారా ప్రసాద్, బత్తిన రామకృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంపౌండ్ వాల్ కు ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను స్వయం గా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లవరపు వెంకటరమణ పలువురు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు వీరి వెంట ఉన్నారు.

## తల్లి పాలే శిశువుకు అమృతం

- మొదటి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి
- ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఆగస్టు 5:** తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రంపచోడవరంలోని వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్సీ) బర్త్ వెయిటింగ్ హాల్‌లో గర్భిణీ స్త్రీలు, బాలింతల కోసం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణ, తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారంపై ఈ కార్యక్రమంలో విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా మాట్లాడుతూ, "తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమృతం. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు సంపూర్ణ పోషకాహారాన్ని పొందడంతో పాటు ఆరోగ్యంగా ఎదుగుతాడు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమతుల్య పోషకాహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుకు తల్లిపాలను అందించడం తమ బాధ్యతగా భావించాలి," అని అన్నారు.అనంతరం గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన సమతుల్య పోషకాహారం, బాలింతల ఆరోగ్య పరిరక్షణ, నవజాత శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...

ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఛలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు. దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో...సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట. ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

**గుంటూరు, ఆగస్టు 5 పెన్ పవర్:** దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి. ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి. దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది. పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ--గుంటూరు--తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ--అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35--38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ---ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది. ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్-టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది. ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు--కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. "అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది. గోదావరి డెల్టా నుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు వరకు అభివృద్ధి ప్రవాహం ఒక దిశలో సాగుతుండగా, మధ్యలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మాత్రం మరో ప్రశ్నను మన ముందుంచుతోంది. సహజ వనరులు ఉన్నా, విస్తారమైన భాగం ఉన్నా, ఎందుకు అదే స్థాయి అభివృద్ధి అక్కడ కనిపించలేదు? ఇదే ఇప్పుడు పరిశీలించాల్సిన తదుపరి అధ్యాయం.

## 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

**ఏలూరు, ఆగస్టు 5 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

# అమరావతిలోనే మంత్రులు.. నివాసాలు రెడీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతిలో రెండు కీలక నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని ఈ నెల 13న సీఎం చంద్రబాబు స్వయంగా ప్రారంభించనున్నారు. వీటిలో 1) సీడ్ యాక్సస్ రోడ్డు నిర్మాణం. ఇది 90 శాతం నిర్మాణం పూర్తయింది. అమరావతి నిర్మాణాలు ప్రారంభమైన నాటి నుంచే నిర్మాణం చేపట్టినా.. మధ్యలో కొందరు రైతులు భూములు ఇవ్వలేదు. దీంతో ఈ నిర్మాణంలో ఆలస్యం జరిగింది. అయితే.. ఇటీవల భూ సేకరణ ద్వారా వాటిని తీసుకున్నారు. దీంతో నిర్మాణాలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. జరుగుతున్న పనులు జరుగుతుండగానే.. ఇప్పటికే పూర్తయిన 90 శాతం సీడ్ యాక్సస్ రహదారిని సీఎం చంద్రబాబు ఈ నెల 13న ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ట్రయల్ రన్‌ను కూడా ప్రారంభించారు. మొత్తంగా 6 గ్రామాలను కవర్ చేస్తూ నిర్మించిన.. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు .. అమరావతికి తలమానికంగా నిలిచింది. ఇది అందుబాటులోకి రావడంతో అమరావతి నిర్మాణంలో కీలక ఘట్టం పూర్తయినట్టేనని అంటున్నారు. ఇక, రాష్ట్ర మంత్రివర్గం మొత్తం అమరావతిలోనే నివాసం ఉండేలా ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి కూడా.. నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇండివిడ్యువల్‌గా 3 స్టార్ రేటింగ్‌తో ఈ నివాసాల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇటీవల ప్రారంభించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా రెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. వీటిని కూడా ఈ నెల 13నే సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. అనంతరం.. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి వీటిని బదలాయిస్తారు. జీఏడీఅధీనంలో ఉండే ఈ మంత్రుల నివాసాలను ప్రాధాన్యాల వారీగా మంత్రులకు కేటాయిస్తారు. తద్వారా.. మంత్రులు పూర్తిసమయం అమరావతిలోనే ఉండనున్నారు. మొత్తం రాష్ట్ర మంత్రివర్గంలో 26 మంది మంత్రులు ఉన్నారు. వీరికి అనుకూలంగా 3 స్టార్ రేటింగ్‌తో ఆధునిక వసతులతో ఈ భవనాలను నిర్మించారు. 26 నివాసాలతో పాటు.. అతి పెద్ద పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ఆట స్థలాలు, ఎమ్యూజ్‌మెంటు పార్కులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలను నిర్మించారు. అలానే మరో 8 ప్రత్యేక నివాసాలను కూడా ఏర్పాటు చేశారు. వీటిని గెస్టులకు కేటాయించేలా ప్లాన్ చేయడం గమనార్హం.

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...

**విజయవాడ, ఆగస్టు 5 పెన్ పవర్:**
రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం. ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు. మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

**విజయవాడ, ఆగస్టు 5 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్-డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు

కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది. సరైన క్రిమినల్ రక్షణ ప్రణాళికలు లేకుండా, అధిష్ఠానం ఇచ్చే రాజకీయ హామీలను మాత్రమే నమ్ముకుని క్షేత్రస్థాయిలో దూకుడు ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జ్‌లు చివరకు న్యాయపరమైన సంక్షోభంలో మునిగిపోతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా ఆ పార్టీలో వినిపిస్తోంది.

# టీమిండియా అలా మారటానికి.. విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి నే కారణం



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ కెప్టెన్ ధోనీ రిటైర్మెంట్ తర్వాత టీమిండియాలో వచ్చిన మార్పులపై కీలక వ్యాఖ్యలు చేశారు మాజీ వైస్ కెప్టెన్ అజింక్యా రహానే. ఇటీవలే అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే.. క్రికెట్ కు సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు. ధోనీ తర్వాత టీమిండియా అలా మారటానికి కారణం కోహ్లీ, రవిశాస్త్రిలేనని అన్నారు.

ధోనీ రిటైర్మెంట్ టీమిండియాను ఒక క్లిష్టమైన దశలో పడేసిందని అన్నారు. ఆ సందర్భంలో టీమ్ మైండ్ సెట్ ను మార్చడంలో విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆటగాళ్లను డేరింగ్, డ్యాషింగ్ గా మార్చడంలో ఈ ఇద్దరు ఎంతో చేశారని అన్నారు. ముఖ్యంగా ఓవర్సీస్ కండిషన్స్ లో టీమ్ మైండ్ సెట్ ను సెట్ చేయడంలో హెడ్ కోచ్ రవిశాస్త్రి, కోహ్లీల పాత్ర మరువలేనిదని అన్నారు. మైకేల్ వాన్, సర్ అలస్టిర్ కుక్, ఫిల్ టఫ్నెల్, డేవిడ్ బంబెల్ లలాయిడ్ కలిసి స్టిక్ టు క్రికెట్ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న రహానే ఈ వ్యాఖ్యలు చేశారు. 2014-15లో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ మధ్యలో ధోనీ రిటైర్ అయినప్పుడు, కోహ్లీ టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. కోహ్లీ తన టీమ్ కు దూకుడుగా ఉండేలా తయారు చేశాడు. ఇది ఇండియాను ప్రపంచంలోనే బలమైన ట్రావెలింగ్ టీమ్ గా ఎదగడానికి సహాయపడింది. ఆ టైమ్ లో టీమ్ లో ఉన్న రహానే, టీమ్ మెంటాలిటీని మార్చినందుకు కోహ్లీకి, అప్పటి హెడ్ కోచ్ రవిశాస్త్రికి ఈ క్రెడిట్ ఇచ్చాడు.ఎంఎస్ ధోనీ టెస్ట్ క్రికెట్ నుండి తప్పుకున్నప్పుడు, విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి భారత క్రికెట్‌ను, ముఖ్యంగా విదేశీ టెస్టుల్లో మరింత పటిష్టం చేశారు. రక్షణాత్మకంగా కాకుండా, మరింత అగ్రెసివ్ గా, ధైర్యంగా, ముందుచూపుతో ఆడేవాళ్ళుగా మారినట్లు రహానే అన్నారు.

మొదటి బంతి నుంచే దాడి చేయాలనిపిస్తే, అలాగే చెయ్యి

అని విరాట్ నాకు ఎప్పుడూ చెప్పేవాడు. ఆయన ఆటగాళ్లకు నిర్భయంగా ఆడేందుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు, అని చెప్పారు. కోహ్లీ, శాస్త్రిల సారథ్యంలో ఇండియా టెస్ట్ దశల్లో అత్యంత విజయవంతమైన దశను ఆస్వాదించింది. ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక సిరీస్‌లను గెలుచుకోవడం, ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకోవడం, తొలి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించడం వంటివి వీళ్లిద్దరి కాంబోలోనే జరిగాయి.

# టీమిండియా మరో బిగ్ షాక్.. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు స్టార్ బ్యాటర్ దూరం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరగనున్న టెస్ట్ సిరీస్?కు ముందు టీమిండియాకు మరో బిగ్ షాకే తగిలే అవకాశం ఉంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇప్పటికే ఈ సిరీస్?కు దూరమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే.. స్టార్ బ్యాటర్ సాయిసుదర్శన్ సైతం శ్రీలంకతో జరగనున్న తొలి టెస్ట్?కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. గత నెలలో శ్రీలంక ఏతో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్?లో సాయిసుదర్శన్ గాయపడ్డాడు.

కాలి వేలికి గాయం కావడంతో ప్రస్తుతం బెంగళూర్?లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. ఆగస్ట్ 15 నుంచి సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆగస్ట్ 4న టీమిండియా శ్రీలంకకు వెళ్లింది. సాయిసుదర్శన్ మాత్రం భారత జట్టుతో ప్రయాణించలేదు. గాయం పూర్తిగా నయం కాకపోవడంతో అతడు తొలి టెస్ట్?కు దూరమయ్యే అవకాశం ఉంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పైనే అతను ఈ సిరీస్?లో ఆడుతాడా లేదా అనే దానిపై ఆధారపడి ఉంది. సాయిసుదర్శన్ కండిషన్?పై బీసీసీఐ వర్గాలు అప్డేట్ ఇచ్చాయి. "శ్రీలంకతో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి టెస్టుకు సుదర్శన్ దూరమయ్యే అవకాశం ఉంది. సుదర్శన్ ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్నారు. ఆగస్టు 4న భారత జట్టుతో పాటు అతడు శ్రీలంక ప్రయాణించలేదు. సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి కోలుకుంటు గంటకు పైగా నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు అతని పరిస్థితిని పర్యవేక్షించిన తర్వాతే.. అతను ఆడేందుకు అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై తుది నిర్ణయం అధికారులు తీసుకుంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే ముందు అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని నిర్ధారించుకోవడం ముఖ్యం" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ టెస్ట్ సిరీస్?లో ఇండియా, శ్రీలంక మధ్య రెండు మ్యాచులు జరగనున్నాయి. ఆగస్ట్ 15 తొలి టెస్ట్, ఆగస్ట్ 23న రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ కు వెళ్లాలంటే టీమిండియాకు ఈ సిరీస్ ఎంతో కీలకం. దీంతో ఎలాగైనా సిరీస్ గెలవాలని గిల్ సేన పట్టుదలతో ఉంది. మరోవైపు.. సొంతగడ్డపై ఇండియాను చిత్తు చేయాలని శ్రీలంక ఉవ్విళ్లూరుతోంది.

# ఇంగ్లాండ్ పౌరసత్వం పొందిన పాక్ క్రికెటర్ ఆమిర్.. ఐపీఎల్ 2027లో ఆడటంపై కీలక వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లాండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ (ఖూా)లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లాండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు.

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లాండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.



# హీరో కాదు.. బ్రాండ్‌గా మారుతున్న కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం కెరీర్‌ను గమనిస్తే ఇటీవల ఓ ఇంట్రెస్టింగ్ ట్రెండ్ కనిపిస్తోంది. ఆతని సినిమాల సంఖ్య కంటే ప్రాజెక్ట్ సెలెక్షన్ స్ట్రాటజీపై ఇండస్ట్రీలో ఎక్కువ డిస్కషన్ జరుగుతోంది. ముఖ్యంగా వరుసగా కొత్త డైరెక్టర్ లతో సినిమాలు చేయడం, ఒకేసారి సినిమా, వెబ్ సిరీస్, అలాగే దర్శకత్వ బాధ్యతలను కూడా తీసుకోవడం ద్వారా తన కెరీర్‌ను కేవలం హీరోగా కాకుండా ఒక క్రియేటివ్ బ్రాండ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది.

సాధారణంగా వరుస సక్సెస్‌ల తర్వాత చాలా మంది హీరోలు సేఫ్ జోన్‌లోకి వెళ్లి, ఆల్రెడీ పేరు తెచ్చుకున్న డైరెక్టర్లతో వర్క్ చేయడానికి ఆసక్తి చూపిస్తారు. కానీ కిరణ్ అబ్బవరం మాత్రం కొత్త కథలు, కొత్త డైరెక్టర్లు, కొత్త ఫార్మాట్ల వైపు అడుగులు వేస్తుండటం భిన్నమైన స్ట్రాటజీగా మారింది. ఇది కమర్షియల్‌గా రిస్క్ అయినప్పటికీ, లాంగ్ టర్మ్ కెరీర్ బిల్డింగ్ పరంగా చూస్తే ఒక స్పష్టమైన ప్లాన్ ఉన్నట్టు కనిపిస్తోంది. చెన్నై లవ్ స్టోరీ సక్సెస్ తర్వాత స్వీయ దర్శకత్వంలో సినిమా చేస్తున్న కిరణ్, తాజాగా మరో కొత్త డైరెక్టర్ కు అవకాశమిచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఒకేసారి సినిమా షూటింగ్, వెబ్ సిరీస్ కమిట్‌మెంట్స్, అలాగే దర్శకత్వ పనులను బ్యాలెన్స్ చేస్తున్న తీరు కూడా గమనించదగ్గ అంశం. ఈ మల్టీటాస్కింగ్ విధానం కేవలం బిజీ షెడ్యూల్‌కు పరిమితం కాదు. థియేటర్ ఆడియన్స్ తో పాటూ ఓటీటీ ఆడియన్స్ ను కూడా చేరుకోవడం, క్రియేటివ్ కంట్రోల్ ను పెంచుకోవడం, ఫ్యూచర్ లో తన బ్రాండ్‌ను విస్తరించడం వంటి అంశాలు ఇందులో భాగంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్త డైరెక్టర్లకు అవకాశాలు ఇవ్వడం కూడా మరో ఇంట్రెస్టింగ్ అంశం.

ఇటీవల టాలీవుడ్‌లో చాలా మంది యంగ్ డైరెక్టర్లు కొత్త కథలతో ముందుకు వస్తున్నారు. అయితే వారికి గుర్తింపు ఉన్న హీరోల సపోర్ట్ లభిస్తేనే ఆ ప్రాజెక్టులు వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త టాలెంట్‌తో పనిచేయడానికి కిరణ్ చూపిస్తున్న ఆసక్తి, ఇండస్ట్రీలో క్రియేటివ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసే దిశగా కూడా చూడవచ్చు. అయితే ఈ స్ట్రాటజీలో ఛాలెంజెస్ కూడా తక్కువేమీ కాదు. కొత్త డైరెక్టర్లతో పని చేయడం అంటే స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ నుంచి ఎగ్జిక్యూషన్ వరకు అనేక అనిశ్చితులు ఉంటాయి. అదే సమయంలో ఒకేసారి పలు ప్రాజెక్టులను నిర్వహించడం వల్ల వర్క్‌లోడ్, టైమ్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అయినా, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం తీసుకుంటున్న డెసిషన్స్ చూస్తే ఆయన టార్గెట్ కేవలం వరుస సినిమాలు చేయడం కాదని, కొత్త డైరెక్టర్లకు అవకాశమిస్తూ, మంచి కథలను ఆడియన్స్ వద్దకు తీసుకెళ్లే దిశగా, థియేటర్- ఓటీటీ రెండింటిలోనూ గుర్తింపు ఉన్న నటుడిగా, అవసరమైతే డైరెక్టర్ గానూ తన గుర్తింపును విస్తరించే మల్టీ డైమెన్షనల్ కెరీర్‌ను నిర్మించుకోవడమే అనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మున్ముందు ఈ ధోరణే ఆయనను ఇతర యంగ్ హీరోల నుంచి వేరు చేసే ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది.



ఆకర్షణీయమైన రూపంతో అందరి హృదయాలను గెలుచుకుంటోంది.





మేధా శంకర్ గ్లామరస్ మెరుపు మరియు బాలీవుడ్ ప్రస్థానం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com